## చిన్నారికి అపన్న హస్తం అందించిన గండికోట కుమార్



**దశ, ఓయూ:** నిమోనియాతో బాదపడుతున్న ఓ చిన్నారికి మెరుగైన వైద్యం నిమిత్తం డీసీసీ జనరల్ సెక్రటరీ గండికోట కుమార్ ఆపన్న హస్తం అందించారు. మాణికేశ్వర్నగర్కు చెందిన హరీష్ కుమార్తె గత కొంత కాలంగా నిమోనియాతో బాదపడుతూ యశోద హాస్పి టల్లో చికిత్స పొందుతుంది. ఖరీదైన వైద్యం కోసం ఆర్థిక సహాయం చేయాలనీ చిన్నారి తండ్రి ఇటీవల కుమార్ను ఆశ్రయించారు. బుధవారం వెంటనే స్పందించిన కుమార్ హాస్పిటల్కు వెళ్లి చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలనీ కోరారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ 25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. చిన్నారి త్వరగా కోలుకోకుని మామూలు స్థితికి రావాలని ఆకాంక్షించారు. కుటుంబానికి అండగా ఉంటామనీ భరోసా కల్పించారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు సాధనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వెంటనే షేడ్స్ ఏర్పాటు చేయాలి.: కమిషనర్ బి. శరత్ చంద్ర




**దశ, నల్గొండ ప్రతినిధి :** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ బి. శరత్ చంద్ర అధ్యక్షతన వివిధ అభివృద్ధి పనులపై కీలక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ్2026లో నగరానికి మెరుగైన ర్యాంకు సాధించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ కీలకమని, మెప్మా సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు క్యూఆర్ కోడ్ మరియు మొబైల్ యాప్ ద్వారా ఫీడ్‌బ్యాక్ ఇచ్చే విధానంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నగరంలోని ప్రధాన ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు జంక్షన్ల వద్ద వాహనదారులకు ఉపశమనం కలిగించేలా తక్షణమే షేడ్స్ (చలువ పందిళ్లు) ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. అదేవిధంగా, వేసవిలో నగరంలో ఎక్కడా త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఇంజినీరింగ్ విభాగానికి సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పరిసరాల్లో పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు కనీస మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. రాములు, ఏసీపీ కృష్ణవేణి, డిప్యూటీ ఈఈ అశోక్, ఏఈ అసీమ్ బాబా, రెవెన్యూ ఆఫీసర్ శివరామ్ రెడ్డి మరియు వార్డు అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీజేపి పవనాలు వీస్తున్నాయి: ఎన్. రామచంద్రరావు

**దశ ఓయూ:** పశ్చిమ్ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపి అఖండ విజయం దేశ ప్రజల మనోగతానికి అద్దం పడుతుందన్నారు. దక్షిణాదిని, ఉత్తరాధిని వేరు చేస్తున్న విచ్ఛిన్నకర రాజకీయాలు చేసిన పార్టీలకు తమిళనాడు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారనీ, ప్రస్తుతం తెలంగాణాలో బీజేపి పవనాలు వీస్తున్నాయనీ బీజేపి రాష్ట్ర ఆధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈ నెల 10న పరేడ్ గ్రౌండ్లో మోడీ బహిరంగ సభ ఏర్పాట్లలో భాగంగా బుధవారం లాలాపేటలో నిర్వహించిన బీజేపి వాల్ రైటింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.




పార్టీ శ్రేణులతో కలిసి గోడలపై బీజేపి బహిరంగ సభను విజయవంతం చేయాలీ, మే 10న చలో పరేడ్ గ్రౌండ్ అంటూ రాతలు వ్రాసారు. రామచంద్రా రావు స్వయంగా గోడపై కమలం పువ్వును అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగాల్ ఎన్నికల్లో ఓడిపోయినా సీఎం పదవికి రాజీనామా చేయననడం అంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని మమతా బెనర్జీ. కాంగ్రెస్ లు అగౌరవ పరుస్తున్నాయన్నారు. చేతిలో రాజ్యాంగం పుస్తకం పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీకి అందులో ఏముందో కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. పైగా రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్న మమతా బెనర్జీతో చేతులు కలుపడం సిగ్గుచేటన్నారు. మొన్నటి వరకు 'ఓటు చోరీ' అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించిన కాంగ్రెస్ ఇప్పుడు' సీటు చోరీ అని కొత్త పల్లవి అందుకుందన్నారు. ప్రజాతీర్పును. రాజ్యాంగాన్ని ధిక్కరించే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ సభకు లక్షలాదిగా తరలి వచ్చి తెలంగాణ గడ్డపై మార్పుకు నాంది పలకాలనీ రామచంద్రరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కనక డివిజన్ బిజెపి ప్రెసిడెంట్ ఉపేందర్ యాదవ్, వెంకటేష్ గౌడ్,మేకల సారంగపాణి రాము పోచయ్య, రాము,మల్లేష్, సంపత్ కుమార్,అశోక్ యాదవ్, ప్రకాష్, జ్యోతి, అనిత, అనూష తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇచ్చాకే ప్రధాని రావాలి: కప్పాటి పాండురంగారెడ్డి డిమాండ్



**దశ, రంగారెడ్డి:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించిన తర్వాతే ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ గడ్డపై అడుగుపెట్టాలని తెలంగాణ రక్షణ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2014 ఎన్నికల ప్రచారంలో మహబూబ్‌నగర్ వేదికగా ఎన్డీయే ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని ఇచ్చిన హామీని ప్రధాని తక్షణమే నిలబెట్టుకోవాలని కోరారు. 12 ఏళ్లు గడుస్తున్నా ఆ మాటను నిలబెట్టుకునే దిశగా కనీస ప్రయత్నం చేయకపోవడంపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఆయన తీవ్రంగా ఎండగట్టారు.

మొన్నటి లోక్ సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి బీజేపీ అభ్యర్థిని గెలిపించినప్పటికీ, ఈ ప్రాజెక్టుపై కేంద్రం నోరు మెదపకపోవడం దక్షిణ తెలంగాణ రైతాంగాన్ని వంచించడమేనని మండిపడ్డారు. ఈ నెల 10వ తేదీన వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టు శంకుస్థాపనకు వస్తున్న ప్రధాని, ముందుగా జాతీయ హోదాపై స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో నీటి పారుదల లేక ఇబ్బందులు పడుతున్న రైతుల పక్షాన తెలంగాణ సమాజం తగిన రీతిలో స్పందిస్తుందని ఆయన హెచ్చరించారు.

## స్వీయ గణన లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి : మున్సిపల్ చైర్మన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మి




**దశ, సూర్యాపేట ప్రతినిధి :** స్వీయ గణన గడువు ముగియడానికి ఈ నెల 10వరకు మాత్రమే సమయం ఉన్నందున, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ వివరాలను నమోదు చేసుకుని ఈ బృహత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మి కోరారు. స్వీయ గణన గడువు ఈ నెల 10వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, జిల్లాలో అవగాహన కార్యక్రమాలను వేగవంతం చేశారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జన గణన 2026 లో భాగంగా ఏర్పాటు చేసిన స్వీయ గణన గడువు ఈ నెల 10వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరుతూ జిల్లా కేంద్రంలో మారథాన్ ర్యాలీ నిర్వహించారు. మారథాన్ ర్యాలీని ప్రారంభించిన అనంతరం చైర్ పర్సన్ మీడియాతో మాట్లాడుతూ స్వీయ గణన ద్వారా ప్రజలు తమ వివరాలను స్వయంగా, ఖచ్చితత్వంతో నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

ఈ నెల 10వ తేదీ లోపు ఆన్‌లైన్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా ప్రతి కుటుంబం తమ వివరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఆర్డీవో ఆర్. వేణు మాధవరావు, సిపివో ఎల్. కిషన్, సూర్యాపేట, సెన్సస్ జిల్లా ఇన్‌చార్జి ఇస్లావత్ హోబాలాల్, డీఎంహెచ్ఓ డాక్టర్ పెండెం వెంకట్ రమణ, మున్సిపల్ కమిషనర్ సిహెచ్. హనుమంత రెడ్డి, సూర్యాపేట, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి రేవంత్ సర్కార్ కట్టుబడి ఉంది

- చిలుక మధుసూదన్ రెడ్డి




**దశ, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తామని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి స్పష్టం చేశారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా బుధవారం ఉదయం బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన 'రైతు వారం' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, ఉత్తమ పండ్ల రైతులను పాలకవర్గం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఒకేసారి రూ. 2 లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకుందని కొనియాడారు. సన్నవడ్లకు బోనస్ అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు భరోసా నిధులను విడతల వారీగా విడుదల చేస్తున్నామని, రైతులకు అనేక ప్రయోజనాలు కల్పిస్తున్న ప్రభుత్వానికి రైతుల పూర్తి మద్దతు ఉందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శిస్తూ, రైతు అభివృద్ధి మరియు సంక్షేమం కోసమే ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ CH. భాస్కర చారి, సభ్యులు బండి మధుసూదన్ రావు, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, నర్సింహా, అంజయ్య, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి L. శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది మరియు భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.




## ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దటమే లక్ష్యం

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి...
- గున్ గల్, గడ్డమల్లయ్యగూడెం గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ...
- కాంగ్రెస్ లో చేరిన గడ్డమల్లయ్యగూడెం సర్పంచ్ మంగజంగయ్య ....

**దశ, ఇబ్రహీం పట్నం :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చినా 9ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇబ్రహీంపట్నం ప్రాంతం అభివృద్ధిలో వెనకబడిందని, తన నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దటమే లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. యాచారం మండలం గున్ గల్, గడ్డమల్లయ్యగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. రూ.1.20కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి కార్యక్రమాలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా గడ్డమల్లయ్యగూడెం సర్పంచ్ మంగాజంగయ్య ఎమ్మెల్యే మల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. మల్ రెడ్డి రంగారెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులైనందునే ఆయన వెంట నడిచేందుకు సిద్ధమైనట్లు వారు తెలిపారు. రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కావాల్సిన నిధులను అడిగిన వెంటనే మంజూరు చేస్తున్నట్లు చెప్పిన ఎమ్మెల్యే ,ప్రజాప్రభుత్వంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.



## వీరబ్రహ్మేంద్ర స్వామికి పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా ప్రత్యేక పూజలు



**దశ, బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మకలశ ప్రతిష్టాపన కార్యక్రమానికి బుధవారం పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారిని దర్శించుకుని, నూతన యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు మాజీ ZPTC కామిరెడ్డి శ్రీలత, మండల నాయకులు కామిరెడ్డి రామకొండారెడ్డి, కోటిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలకు ప్రజలకు వివరించాలి

❖ పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు



**దశ, బూర్గంపాడు:** కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలను ప్రజలకు వివరించాలని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. సారపాక ITC గెస్ట్ హౌస్ లో బుధవారం నిర్వహించిన బూర్గంపాడ్ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ S.I.R (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ పై అవగాహన కల్పించారు. బూత్ స్థాయిలో ఏజెంట్లు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అప్రమత్తంగా ఉండి ఓట్లు చేరికలు, తొగింపులు గమనించాలన్నారు. అదేవిదంగా రాబోయే MPTC, ZPTC ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి BRS పార్టీ మాజీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, సానికొమ్ము శంకర్‌రెడ్డి, బిక్కసాని శ్రీను, వంశీకృష్ణ, లక్ష్మినారాయణ రెడ్డి, జగదీష్, కె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**దశ, బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్వహించిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ మరియు శివలింగ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధరారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామాభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అశ్వాపురంలో రేగా విస్తృత పర్యటన



**దశ, అశ్వాపురం:** అశ్వాపురం మండలంలో బుధవారం పినపాక మాజీ ఎమ్మెల్యే, BRS పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు విస్తృతంగా పర్యటించారు. పర్యటనో భాగంగా అశ్వాపురం BRS పార్టీ మండల నాయకులు కందుల కృష్ణార్జున్ గారు ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించు కోవడంతో వారి ఇంటికి వెళ్ళి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. మామిళ్ళవాయి గ్రామంలో ఇటివల BRS పార్టీ నాయకులు బొర్రా శ్రీను కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతుడి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. మొండికుంట గ్రామంలో ఇటీవల మర్రి అశోక్ రెడ్డి సతీమణి అనారోగ్యంతో మరణించగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ మండల మాజీ అధ్యక్షులు కోడి అమరేందర్, మండల నాయకులు మర్రి మల్లారెడ్డి, కొల్లు మల్లారెడ్డి, జాలె రామకృష్ణ రెడ్డి, సుధీర్, గద్దల రామకృష్ణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# BTPSలో కాలుష్యంపై అధికారుల తనిఖీలు

❖ ఏడూళ్లబయ్యారంలో కాలుష్య ప్రాంతాలను సందర్శించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారుల బృందం

❖ అనారోగ్య సమస్యలతో ఇబ్బందుల పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసిన గ్రామస్థులు

❖ పరికరాల ద్వారా దుమ్ముతై శాంపిల్స్ సేకరణ

❖ గత రెండు నెలలుగా వెల్లువెత్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆకస్మిక తనిఖీలు



**దశ, పినపాక:** పినపాక మణుగూరు మండలాల సరిహద్దుల్లో గల భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో కాలుష్యం ఎక్కువగా ఉందనే ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారుల బృందం ఆకస్మికంగా BTPSలో, ఏడూళ్లబయ్యారం గ్రామంలో, రైతుల పొలాల్లో, వీధుల్లో పలు ప్రాంతాల వద్ద తనిఖీలు నిర్వహించారు. ముందుగా భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో అధికారులను కలిసి విద్యుత్ తయారీకి ఉపయోగిస్తున్న బొగ్గును పరిశీలించారు. ప్లాంట్ ఆవరణలో కలియతిరిగి అన్ని ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఏడూళ్లబయ్యారం గ్రామంలో అన్ని వీధులను పరిశీలించారు. గ్రామస్థులు, రైతులు అందరూ BTPSలో యంత్రాల వాడకం మూలంగా ప్రతిరోజు బొగ్గుతో కూడిన దుమ్ము, ధూళీ ప్రజలపై, వస్తువులపై, పశువులపై, పొలాల్లో పంటలపై పడుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం మూలంగా తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్యం భారిన పడి పిల్లలు, వృద్ధులు, తరుచూ చర్మవ్యాధులు, గొంతునొప్పి, ముక్కునొప్పిలాంటి సమస్యలు వస్తున్నాయని ఏడూళ్లబయ్యారం గ్రామస్థులు అధికారులకు ఆవేదనతో తెలిపారు. అదేవిధంగా పశువులు కూడా అనారోగ్యపాలౌతున్నాయని వారి దృష్టికి తీసుకవెళ్లారు. కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఇంజనీర్ అజయ్ ఆధ్వర్యంలో సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది గ్రామస్థుల నుండి పూర్తి వివరాలు సేకరించారు. కాలుష్యం నిర్ధారణ చేసేందుకు తగు పరికరాలతో కొన్ని ప్రాంతాలలో శాంపిల్స్ సేకరించారు. విచరణ జరిపిన తర్వాత తగు చర్యలు తీసుకుంటామని, అధికారులు తెలిపారు.

**ఫిర్యాదుల వెల్లువతో స్పందించిన అధికారులు**

వాతవరణంలో వస్తున్న మార్పులకు BTPS లో బొగ్గుతో కూడిన దుమ్ము,ధూళీ మూలంగా చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్య పాలౌతున్నట్లు ఏడూళ్లబయ్యారం, ఎల్చిరెడ్డిపల్లి, సీతారాంపురం, ఉప్పాక, బొమ్మరాశిపల్లి, పాతరెడ్డిపాలెం, చింతలబయ్యారం, వెంకట్రావ్‌పేట గ్రామాల నుండి గ్రామస్థులు ఐక్యంగా కాలుష్యంపై పోరాటం చేస్తున్నారు. దశల వారీగా ఆందోళనలు ఉధృతంగా చేస్తామని ఇప్పటికే వాట్సప్ గ్రూప్ ద్వారా అన్ని గ్రామాల ప్రజలను ఏకం చేస్తున్నారు.

అందులో భాగంగా ఆన్‌లైన్ ద్వారా కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా సుమారు 20 ఫిర్యాదులు చేశారు. వరుస ఫిర్యాదులతో స్పందించిన సంబంధిత ఉన్నతాధికారులు జిల్లా అధికారిని విచరణ నిమిత్తం BTPSకు, ఏడూళ్లబయ్యారంకు పంపించారు.



## గ్యాస్,పెట్రోల్ ధరల పెంపుపై సిపిఐ నిరసన

**దశ, పినపాక:** పినపాక మండలంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరతను నివారించి దిగుమతులను పెంచాలని సీపీఐ మండల కార్యదర్శి తోగటి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ పినపాక మండల కమిటీ అధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మండల కార్యదర్శి తోగటి కుమార్ మాట్లాడుతూ.. మండలంలో పంటల కోతల సమయంలో డీజిల్ లేకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదని చెప్పే పాలకులు ఒక్కసారి పేద ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఒక్కొక్క సిలిండర్ పై రూ.2 వేలు నుండి రూ.3 వేలు ధర అమ్ముతున్నారన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు గడ్డం మనోహర చారి, సహాయ కార్యదర్శులు కప్ప వెంకటేశ్వర్లు, రమేష్ ఐలయ్య, వర్షా నరసింహారావు, హమాలీల సంఘం కుర్రి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ధర్నా



**దశ, మణుగూరు:** రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ డీజిల్ గ్యాస్ కొరతను నివారించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ రాష్ట్ర పిలుపుమేరకు మణుగూరు పట్టణంలో బుధవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయం ముందు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతతో సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఒకవైపు డీజిల్ లేక రైతాంగం ట్రాక్టర్లు నడపలేక పంటలకు ఇబ్బందులు జరుగుతున్నాయని, రవాణా వ్యవస్థ పూర్తిగా కుంటుపడిందని, పేద తరగతి కుటుంబాల వారు గ్యాస్ కొరతతో ఇబ్బందులు పడుతుంటే కొంతమంది దళారులు మార్కెట్లో వీటిని సొమ్ము చేసుకుంటున్నారని వారు ఆరోపించారు.

టు వీలర్ సామాన్యుడు పెట్రోల్ కొనుక్కుందాం అంటే కనీసం గంటల తరబడి పెట్రోల్ బంకుమందు నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వీటన్నింటిని పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. మొన్నటి వరకు యుద్ధం పేరుతో గ్యాస్ దొరకడం లేదని కుంటి సాకులు చెప్పారని నేడు ఏమైందని ఉన్నటువంటి వాటిని బ్లాక్ మార్కెట్లలో అధిక రేట్లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు తప్ప సామాన్యుడు బాధలు కష్టాలు తీర్చే పరిస్థితిలో ప్రభుత్వాలు లేవని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జక్కుల రాజబాబు ,పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ లక్ష్మీనారాయణ, సిపిఐ సీనియర్ నాయకులు మంగి వీరయ్య, సర్పంచ్ చీడ0 ఉషారాణి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, వార్డు మెంబర్ నిరోష, శ్రీ యాను, మాజీ సర్పంచ్ బాడిశ సతీష్ కార్యవర్గ సభ్యులు నోముల రవి కొత్తపల్లి సీతారాములు,కన్నెబోయిన ప్రసాద్, కనీతి సత్యనారాయణ, గోపిశెట్టి శివయ్య, బోసెట్టి సంపత్, అడబాల ప్రవీణ్, బొగ్గు సంఘం కార్యదర్శి యాకూబ్, రంజిత్, రంగు ఆంజనేయులు, బాడిశ హనుమయ్య, విష్ణు, పల్లపు వెంకటేశ్వర్లు, అవినాష్ రెడ్డి, గడ్డి కొప్పులరాములు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ ధ్యేయం

❖ అర్హతే ప్రామాణికం.. మూడు నెలల్లో పరిష్కారం

❖ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**దశ, ఖమ్మం:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాలేరు నియోజక వర్గం నేలకొండపల్లిలో ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర రెవిన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి "ప్రజా దర్బార్" కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని భరోసా కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు నిర్వహించిన 7 క్లస్టర్ల పరిధిలో వచ్చిన 10 వేల దరఖాస్తులలో 5 వేల వరకు ఇందిరమ్మ ఇళ్ల కోసమే రావడం వాటి అవసరాన్ని సూచిస్తోంది , వీటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు.

రాబోయే రెండు, మూడు, నాలుగు విడతల్లో అర్హులైన పేదలందరికి ఇండ్లను మంజూరు చేస్తాం. పాలేరు నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్ల తొలగింపు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అర్హులైన ప్రతి పేదవారికి అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగింది. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిస్తుంది. ముఖ్యంగా సాదాబైనామా దరఖాస్తులను అర్హత మేరకు రాబోయే 35 రోజుల్లో పరిష్కరిస్తాం. సాదాబైనామా పేరుతో ప్రభుత్వ భూములను కాజేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. అటువంటి దరఖాస్తులను వెంటనే తిరస్కరించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆర్డీఓ, పోలీస్ మరియు వివిధ శాఖల అధికారులు, క్లస్టర్ పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం కేంద్రంగా రైల్వే డివిజన్ పరిశీలనలో ఉంది

❖ ఎంపీ వద్దిరాజు వినతికి స్పందన

❖ ప్రత్యుత్తరం రాసిన రైల్వే మంత్రి వైష్ణవ్



**దశ, భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేసే అంశం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉపనేత, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు రాసిన లేఖలో రైల్వే డివిజన్ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ ఏర్పడి వందేళ్లకు చేరువవుతున్న సందర్భంగా, దాని చారిత్రక నేపథ్యాన్ని వివరిస్తూ.. కొత్తగూడెం కేంద్రంగా రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా.. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు ఎంపీ రవిచంద్ర వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం నుంచి కిరండోల్, మల్కాన్ గిరి, కొవ్వూరు రైల్వే లైన్లు ఏర్పడితే తెలంగాణ, ఛత్తీస్ ఘడ్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉంటుందని ఆయన మంత్రికి వివరించారు. ఈ వినతికి స్పందించిన అశ్విని వైష్ణవ్ ఈ సూచనను రైల్వే ఉన్నతాధికారుల పరిశీలనకు పంపామని, పూర్తికాగానే తదుపరి చర్యలు చేపడతామని కేంద్రమంత్రి ఎంపీ రవిచంద్ర కు రాసిన ప్రత్యుత్తరంలో బదులిచ్చారు.